క్లుప్తంగా

మంగరాయ ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ



ఆదోనిఅర్బన్ : పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి శ్రావణమాసం నాలుగో శనివారం సందర్భంగా వెన్నతో అలంకరించారు. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారులు గురురాజ ఆచారి, అక్షయ్‌కుమార్ భక్తుల సాయంతో ఆంజనేయస్వామికి వెన్నతో అలంకరించారు. ముందుగా స్వామి వారికి ఫల పంచామృతాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం ఓ భక్తుడు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాలకు చెందిన గండ్ల గంగాధర్, కుటుంబ సభ్యులు రూ.1,00,116ను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

రైలు కింద పడి మహిళ మృతి



నీలావతి (ఫైల్)

మద్దికెర: మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన మతి స్థిమితం లేని నీలావతి (45)శనివారం రైలు కింద పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో పలుమార్లు వైద్యశాలలో చూపించినా నయం కాలేదు. ఈక్రమంలో అఘాయిత్యానికి పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణులకు భోజన సదుపాయం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న డాక్టర్ కల్పన

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి శనివారం స్కానింగ్ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి భోజన సదుపాయాన్ని కల్పించారు. గైనకాలజిస్టు కల్పన చేతుల మీదుగా భోజనం వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, ఎంపీటీసీ దేవరగట్టు లక్ష్మి, నెనావత్ సరోజ, వార్డు మెంబర్లు బోడా సావిత్రి, లైట్ నాగరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గణపతి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం గ్రంథాలయ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చందిరన్ మాట్లాడుతూ హిందీ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈనెల 15 వరకు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఉంటుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మృతి

తుగ్గలి: ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మీటేతండాకు చెందిన రమావత్ లక్ష్మిబాయి (55) అనారోగ్యంతో మృతి చెందారు. కాన్సర్‌వ్యాధితో బాధపడుతున్న ఆమెకు రెండేళ్ల క్రితం ఆపరేషన్ చేయించారు. అయినా కోలుకోలేక శనివారం మృతి చెందింది. 2014లో ఆమె టీడీపీ తరపున ఉప్పర్లపల్లి ఎంపీటీసీ స్థానం నుంచి గెలుపొందారు. లక్ష్మిబాయికి నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

ఆస్పరి: జగన్న భూ రక్ష భూసర్వే పథకంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. శనివారం మండలంలోని శంకరబండ, తురువగల్లు గ్రామాల్లో మండల జెడ్పీటీసీ దొరబాబు సమక్షంలో ఈఓఆర్డీ నరసింహా రెడ్డి ధ్రువపత్రాలు అందించారు. సొసైటీ చైర్మన్ గోవర్దన్, మండల కన్వీనర్ పెద్దయ్య పాల్గొన్నారు.

రమణీయం రథోత్సవం

- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన ఆదోని పట్టణం
- రణమండల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



రథోత్సవంలో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు, హిందూ సంఘాల సభ్యులు, ప్రముఖులు



రథోత్సవం ముందు హనుమ మాలధారులు

ఆదోనిఅర్బన్ : జై శ్రీరామ్... జై శ్రీరామ్ అనే నామస్మరణతో ఆదోని పట్టణం మారుమోగింది. శ్రావణమాసం ఉత్సవాల్లో భాగంగా నాలుగో శనివారం సందర్భంగా రణమండల ఆంజనేయస్వామి వారి రథోత్సవం పట్టణంలో అశేష భక్తజనం తరలిరాగా.. పండితులు వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నందికోలు సేవ, ఆంజనేయస్వామి మాలధారుల హనుమ నామ జపం, భక్తుల భక్తిగీతాలాపనుల నడుమ రమణీయంగా సాగింది. ముందుగా ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగయ్యశెట్టితో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, హిందూ సంఘాల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాచోటి సుధాకర్, మారుతిరావు, శ్రీనివాస ఆచారి, ఎండీ బసవరాజస్వామి, నాగరాజ్‌గౌడ్, వెంకటేష్ రథానికి ప్రత్యేక పూజలు చేసి ఆంజనేయస్వామి ఉత్సమూర్తిని రథంపై



భారీ ఆంజనేయస్వామి విగ్రహం

అధిష్టింపజేసి ముందుకు కదిలించారు. రథోత్సవం స్థానిక అర్థగేరి సాయిబాబా ఆలయం నుంచి నిర్మల్ టాకీస్, అభయాంజనేయస్వామి, కోట్ల కూడలి



ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయస్వామి

మీదుగా పాత బస్టాండు నుంచి తిరిగి సాయిబాబా ఆలయానికి చేరుకుంది. భక్తులు తరలిరావడంతో పట్టణ వీధులు కిటకిటలాడాయి. స్వామి రథోత్సవాన్ని తిలకించి తన్మయత్వం పొందారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నెలోని ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వందలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు. కౌతాళంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు.

గోపాల్‌రెడ్డికి అస్వస్థత

ఆదోనిటౌన్ : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధితో శనివారం అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకుంటున్నాడని చెప్పారు. కొద్ది రోజులుగా గుండె సంబంధిత జబ్బుతో బాధపడుతున్నాడని, అయితే శనివారం తీవ్ర అస్వస్థతకు గురైనట్లు చెప్పారు.

తప్పుచేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరు



సమావేశంలో మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు/మంత్రాలయం : తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరని వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడుకు శిక్ష తప్పదన్నారు. పక్కా ఆధారాలతోనే ఆయనను సీఐడీ అరెస్టు చేసిందన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని, తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. నిజాయితీ పరుడు కాబట్టే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 16నెలలు జైలులో ఉన్నా ఎవరిపై బురద చల్లలేదన్నారు. తప్పు చేయకపోతే చంద్రబాబుకు ఉలికిపాటు ఎందుకన్నారు. ఏది ఏమైనా చట్టం తనపని తాను చేసుకొనిపోతుందన్నారు. శనివారం మండలంలోని కల్లుకుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధి పొందిన పథకాల గురించి వివరించారు. గతంలో పథకాలు కొందరికే అందేవని, నాలుగున్నరేళ్లుగా అర్హులందరికీ ఇంటి వద్దకే అందేలా సీఎం జగనన్న చర్యలు చేపట్టారని వివరించారు. అనంతరం వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఇస్మాయిల్, గొర్రెల ఫెడరేషన్ జిల్లా డైరెక్టర్ యల్లప్ప, దొడ్డిమేకల సర్పంచు చంద్రశేఖర్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మద్యం రవాణాదారుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోని రూరల్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, కారు సీజ్ చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. మండలంలోని పెద్ద పెండేకల్ గ్రామంలోని హనుమప్పగుడి క్రాస్ వద్ద ఇస్వీ గ్రామానికి చెందిన పి.ఉశేన్‌సాబ్, పెండేకల్‌కి చెందిన ఎం.గోపాల్, కామవరం గ్రామానికి చెందిన హమీద్, హాల్వికి చెందిన ఖాసీం కారులో 40 బాక్సుల ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా పట్టుబడ్డారన్నారు. వారిని అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, శివప్రసాద్, పీసీలు సోమేష్, శ్రీనివాస్, రోహిన్, సుధాకర్ పాల్గొన్నారు.

చట్టం తన పని తాను చేసింది

ఆదోనిటౌన్ : చట్టం దృష్టిలో అందరూ సమానులే. పేద, ధనిక తారతమ్య బేధం లేదు. అందుకు ఉదాహరణే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ ఘటనను పేర్కొనవచ్చు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతికి పాల్పడినట్లు సీఐడీ పోలీసులు తేల్చి అరెస్టు చేశారు. ఇప్పటికే పలు అవినీతి ఆరోపణ కేసుల్లో ఆయన కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకున్నారు. అయితే ఎప్పుడూ అధర్మానిదే పైచేయి కాదుకదా. ప్రస్తుతం సీఐడీ అధికారులు పక్కా ఆధారాలు సేకరించి అరెస్ట్ చేశారు. అయితే నిజం తెలిసిపోవడంతో టీడీపీ నాయకులు నోరు మెదపడానికి వెనకాడుతున్నారు. కనీసం ఖండనకు కూడా ముందుకు రావడానికి ఇష్టపడటం లేదని తెలిసింది.

అవినీతి అని తేలడంతోనే అరెస్ట్



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబునాయుడు ప్రమేయం ఉందని సీఐడీ పోలీసులు విచారణలో తేల్చారు. ఆ వ్యవహారంలో చంద్రబాబునాయుడు, అతని అనచరుల హస్తం ఉన్నట్లు తేలడం వల్లనే అరెస్టు చేశారు. ఈ అరెస్టు ఘటన అవినీతిపరుల గుండెల్లో దడ పుట్టిస్తోంది. అవినీతికి పాల్పడాలంటే ఆలోచించాలి.

– నాథాయిద్ ఇస్మాయిల్, కౌడలపేట, ఆదోని

కోట్లాది రూపాయలు కొల్లగొట్టారు



నకిలీ కంపెనీల పేరుతోకోట్లాది రూపాయలు కొల్లగొట్టారు. చంద్రబాబునాయుడి ప్రమేయంతోనే అవినీతి జరిగిందని సీఐడీ ఆధారాలు సేకరించడం అభినందనీయం. బాబు అవినీతి బాగోతం ఒక్కొక్కటిగా బయటపడుతోంది. ప్రజాధనాన్ని కొల్లగొట్టడం ఎంతవరకు సబబు.

– వీరన్నగౌడ్, ధణాపురం

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఆదోని సెంట్రల్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు పొందిన వారిని ఎస్టీయూ అధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ–2 శ్రీనివాసులు, రిటైడ్ హెచ్‌ఎం శివన్న, ఎస్టీయూ సీనియర్ నాయకుడు నాగరాజు హాజరై మాట్లాడారు. అనంతరం అవార్డులు పొందిన జి. పద్మావతి, నూర్ అహ్మద్, ఆదిమూర్తిని సత్కరించారు. ఎస్టీయూ నాయకులు వెంకోబ,వీరచంద్ర యాదవ్, మహదేవప్ప, సుంకన్న, ప్రహ్లాద్, సత్య, రామాంజి పాల్గొన్నారు.



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

మండలంలోని అగసనూరు గ్రామ సమీపంలో తుంగభద్ర నదిపై నిర్మించిన రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్టపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఇటీవల కర్ణాటక, ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వర్షపు నీరు ఆనకట్ట వద్దకు చేరుకుని కొంతమేర దిగువకు ప్రవహిస్తోంది. వర్షపు నీటి రాకతో నదీ తీర పొలాల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

– కోసిగి

పెద్దతుంబళంలో చోరీ

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో పార్వతీబాయి, రవినాయక్ దంపతుల ఇంట్లో శుక్రవారం దొంగతనం జరిగిందని ఎస్‌ఐ పీరయ్య శనివారం తెలిపారు. దంపతులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ఉదయం యథావిధిగా విధులకు వెళ్లిపోయారు. సాయంత్రం వచ్చి చూడగా తలుపులు తీసి ఉండటంతో చోరీ జరిగిందని భావించి ఇంట్లోకి వెళ్లి చూడగా ఆరు తులాల బంగారు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో శుక్రవారం రాత్రి క్లూస్ టీంతో విచారణ జరిపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పత్తికొండటౌన్: శ్రావణమాసం ఆరుద్ర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పార్వతికొండపై వెలసిన శివాలయంలో రుద్రహోమం ,మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు

రాజీకి మించిన మార్గం మరొకటి లేదు

- జిల్లా జడ్జి పి.జె.సుధ
- మెగా లోక్ అదాలత్‌లో 6,269 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా రెండో అదనపు జడ్జి పి.జె.సుధ

ఆదోనిరూరల్ : క్షణికావేశం, మనస్పర్థలు, ద్వేషం వంటి వాటిని మనస్సులో పెట్టుకొని కోర్టుకు తిరగవద్దని, రాజీకి మించిన రాజమార్గం మరొకటి ఉండదని జిల్లా అదనపు రెండో జడ్జి పి.జె.సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె హాజరై కక్షదారులు, బాధితులతో మాట్లాడారు. చేయని నేరాలకు, క్షణికావేశంతో చేసిన నేరాలు, మనస్పర్థలు, ద్వేషంతో కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని, డబ్బులు నష్టపోవద్దని సూచించారు. సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వీరవెంకటనాగలక్ష్మి, సెషన్ అండ్ సివిల్ కోర్టు జడ్జి శైలజ, న్యాయవాదులు ఆనంద్, విశ్వనాథ్, ఈరన్న పాల్గొన్నారు.

6,269 కేసుల పరిష్కారం

ఆదోని కోర్టుల పరిధిలో ఉన్న వివిధ కేసులకు సంబంధించి 6,269 కేసులు శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యాయి. ఇందులో రోడ్డు ప్రమాదాలు 11, క్రిమినల్ అప్పీల్–02, ఐపీసీ–80, సివిల్ కేసులు–12, ప్రీ లిటిగేషన్ (సమ్మరీ ట్రయల్)–6,154 కేసులు పరిష్కారమయ్యాయి.

ఆత్మహత్య.. సమస్యకు పరిష్కారం కాదు

- మానసిక సంఘర్షణలతోనే అఘాయిత్యాలు
- సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటేనే విలువ
- నేడు ఆత్మహత్యల నివారణ దినోత్సవం



రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి (ఫైల్)

ఆదోని సెంట్రల్: సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని వాటిని జయించినప్పుడే లభించే విజయానికి విలువ ఎక్కువగా ఉంటుంది. అలా కాదని మానసిక సంఘర్షణకు లోనై, ఆత్మన్యూనత భావనతో పాటు, వాటికి భయపడి ఆత్మహత్యకు పాల్పడటం సమస్యకు పరిష్కారం కాదు. జీవితంలో సుఖాలతో పాటు కష్టాలతో చోటుంది. నిరుపేదలైనా, ధనవంతులైనా ఏ స్థాయి వారికి ఆ స్థాయిలో సమస్యలుంటాయి. అలా గని వాటికి భయపడి పిరికితనంతో బలవన్మరణాలకు పాల్పడకుండా ఎదురొడ్డి నిలిచినప్పుడే మనలోని నిజమైన పోరాటయోధుడు బయటకు వస్తాడు.

కుటుంబమే అసలైన బలం..

సమస్యలు తీవ్రమైనప్పుడు వాటితో తన కుటుంబంతో పంచుకోవడం, పరిష్కారమార్గాలను ఆలోచించడం, సలహాలు స్వీకరించడం, అన్యోన్యంగా ఉండటం వంటి వాటితో సగం సమస్యలు తగ్గుతాయని ముఖ్యంగా పరిష్కార మార్గాలు సూచించే అవకాశముండటంతో వారి అభిప్రాయం ఫలించే అవకాశముంది. ఇక సమస్యలతో సతమతమవుతున్న సమయంలో మానసిక సంఘర్షణకు లోనుకాకుండా చూసుకోవలసిన బాధ్యత కుటుంబ సభ్యులదే. ఆ సమయంలో వారికి ధైర్యం చెప్పి, వెన్నంటి నిలవాలి. పని ఒత్తిడి, పరిమితి లేని కోర్కెలను అదుపులో ఉంచుకోవాలి. చిన్న చిన్న విషయాలకు ఆవేశపడడం , మానసిక సంఘర్షణకు గురికాకుండా చూసుకోవాలి. ఇక పిల్లల విషయంలో తల్లిదండ్రులు వారి మానసిక స్థితిని అంచనా వేస్తుండాలి. వారిని నిత్యం గమనిస్తూ ఉంటే ప్రాణాలను కాపాడినట్లే.

క్షణికావేశం వద్దు



చిన్న చిన్న విషయాలకు ఆవేశపడి, క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం మంచిది కాదు. ఎప్పుడూ సమస్యలను కొని తెచ్చుకోకూడదు. కోర్కెలను అదుపులో ఉంచుకున్నప్పుడే తప్పులు చేసేందుకు అవకాశముండదు. ఆత్మహత్యల్లో అధిక శాతం అప్పుల వల్ల చోటుచేసుకుంటున్నాయి. అప్పు తీసుకునే ముందు మన స్థాయి ఏంటి, ఆ అప్పు మనం చెల్లించగలమా, ముఖ్యంగా మనకు అది అవసరమా అని బేరీజు వేసుకుంటే కుటుంబాలు అనాథలుగా మారవు. నిరుత్సాహానికి గురి కాకుండా సమస్యలను అధిగమించాలి. మానసిక సంఘర్షణకు గురి కాకుండా సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి.

– డాక్టర్ కృష్ణమూర్తి

బాధ్యతలు, కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలి



ఆత్మహత్యకు పాల్పడే ముందు ఒకసారి భార్య బిడ్డలు, బాధ్యతలు, వారి భవిష్యత్ గుర్తు చేసుకోవాలి. కుటుంబ పెద్ద దూరమైతే ఆ కుటుంబం ఎన్ని అవస్థలు పడాల్సి వస్తుందో గుర్తెరగాలి. సమస్య ఏదైనా పోలీసులను ఆశ్రయిస్తే పరిష్కార మార్గం చూపుతారు. మొదట పిరికితనంగా ఆలోచించడం మానుకోవాలి. ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి. బాధలు, సమస్యలను ఆత్మీయులతో పంచుకోండి. వారి సలహా కోరాలి. కుటుంబంతో సమష్టిగా ఆలోచించి పరిష్కారంలో వారిని భాగస్వాములను చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుంది. అధిక అప్పులు ఎప్పుడైనా ప్రమాదకరమే. ఆత్మహత్యకు పాల్పడకుండా ఆలోచన విధానాన్ని మార్చుకుంటే సంతోషం పెరుగుతుంది.

– శివ నారాయణస్వామి, డీఎస్పీ

చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న విజయ్‌కుమార్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్/టౌన్) : ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాయలసీమ జోన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఐ.విజయ్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. శనివారం విజయవాడలో నిర్వహించిన ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఎథిక్స్ కమిటీ సభ్యులు మురళి చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాలు అందజేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

మద్దికెర: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని పెరవలి శ్రీరంగనాథ స్వామి ఆలయంలో రూ.68 లక్షలతో తూర్పు, దక్షిణ మూడు అంతస్తుల రెండు రాజగోపురాల నిర్మాణ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం మన ధర్మమన్నారు.ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరి గౌడ్, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు



ఆర్‌యూలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఆరు కేంద్రాల్లో జరుగుతున్న పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఆర్‌యూలోని లైఫ్ సైన్సెస్, అకడమిక్ భవనాల్లో పీజీ పరీక్ష కేంద్రాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

15మంది గైర్హాజరు :

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పీజీ నాలుగోసెమిస్టర్ పరీక్షలకు 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు చెప్పారు. 536 మందికి గాను 521 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయన పేర్కొన్నారు.

మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న ఉస్తాజా ముబీనా ఖనం

కర్నూలు(సెంట్రల్): మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమని దారులుమాన్ ట్రస్టు ఇండియా చైర్మన్ ఉస్తాజా ముబీనా ఖనం అన్నారు. శనివారం రాయల్ ఫంక్షన్ హాలులో ముస్లిం మహిళ మత పెద్దల ఆధ్వర్యంలో ఇస్తేమా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రవక్త మహ్మద్ జీవిత చరిత్ర, ప్రస్తుతం జరుగుతున్న విషయాలపై ప్రసంగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రవక్త ఆదర్శ జీవితం గురించి తెలియజేసి ఆచరించేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఖురాన్ చెప్పిన నిబద్ధతను పాటించాలన్నారు. అనంతరం విద్య, ఖురాన్, నమాజ్, రోజా తదితర విషయాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో ప్రబోధ సేవా సమితి–ఇందు జ్ఞాన వేదికల గ్రామ కమిటీ సభ్యులు గ్రామంలో ఆరడగుల కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలు చేశారు. అందులో భాగంగా స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామవీధుల గుండా అశేష భక్త జనం మధ్య ఊరేగించారు. బాలికల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ ఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యులు తలారి కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందురాజులు, పురుషోత్తం, శంకరయ్య, మాజీ సర్పంచ్‌లు నాగన్న, కృష్ణయ్య, కమిటీ సభ్యులు రామాంజనేయులు, గంగాధర్, మల్లికార్జున, మాధవకృష్ణలు పాల్గొన్నారు.